లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద ట్రాఫిక్ దారి మళ్లింపు


పవన్ కుమార్

చందానగర్: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నాలా పనులు చేపడుతున్న సందర్భంగా నెల రోజుల పాటు వాహనాలను దారి మళ్లింపు ఉంటుందని రామచంద్రపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గచ్చిబౌలి నుంచి వాహనాలు గుల్‌మోహర్ పార్కు సిగ్నల్ నుంచి నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా లింగంపల్లి, బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు దారి మళ్లింపు ఉంటుందన్నారు. అదేవిధంగా చందానగర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, రామచంద్రపురం నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాలు లింగంపల్లి చౌరస్తా నుంచి నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా గుల్ మోహర్ పార్కు సిగ్నల్ నుంచి వెళ్లాలన్నారు.

వినాయకుడి లడ్డూ రూ.65వేలు


లడ్డుతో సురేందర్‌గౌడ్

చందానగర్: ఓల్డ్ హఫీజ్‌పేట్ టీం త్రిశూల్ వినాయకుడి లడ్డూ రూ.65వేలు పలికింది. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని త్రిశూల్ గణనాథుడి లడ్డూ వేలంలో కనకమామిడి సురేందర్ గౌడ్ లడ్డూను కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పూజలను నిర్వహించి ఆయనకు లడ్డూ అందజేశారు. మరో లడ్డూను బోయిని గోపాల్ తనయుడు బోయిని మల్లేష్‌యాదవ్ రూ. 45,500లకు కైవసం చేసుకున్నాడు. ఈ వేలం పాటలో త్రిశూల్ సభ్యులు అవినాష్‌గౌడ్, అరవింద్‌గౌడ్, అన్వేష్‌గౌడ్, బన్నీగౌడ్, ప్రణయ్, ధీరజ్, అక్షయ్, ఓంకార్, చందు పాల్గొన్నారు.

'అనుసంధాన్ చట్టం అన్ని రంగాలను ఏకతాటిపైకి తీసుకొస్తుంది'

రాయదుర్గం: దేశంలో పరిశోధనలు పెరిగి సాంకేతికత అందరికీ అందుబాటులోకి వచ్చేందుకు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్) చట్టం–2023 ఎంతగానో ఉపయోగపడుతుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. శనివారం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ పేరిట ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ చట్టం ద్వారా స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) రంగాలను సామాజిక శాస్త్రాలతో అనుసంధానం చేసేందుకు ఎంతో దోహదపడుతుందని వివరించారు. దేశంలోని పరిశోధనలు, సృజనాత్మకత, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ రంగాలను ఏఎన్ఆర్ఎఫ్ ముందుకు నడిపిస్తుందన్నారు. జాతీయ విద్యా విధానం–2020 ఫిలాసఫీ ఆధారంగా ఏఎన్ఆర్ఎఫ్ పనిచేస్తుందని పేర్కొన్నారు.

హిందీ భాషను తప్పకుండా నేర్చుకోవాలి



గచ్చిబౌలి: హిందీ భాషను తప్పకుండా నేర్చుకోవాలని సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో హిందీ భాష దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో రెండవ అతి గొప్ప భాష హిందీ అని అన్నారు. విద్యార్థులు రూపొందించిన అక్బర్ బీర్బల్ బొమ్మలాటను హిందీలో చూపించారు.

మురుగు సమస్యను పరిష్కరించండి సారూ..

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రధాన రహదారుల్లో నెలల తరబడి ప్రవహిస్తున్న మురుగు


మియాపూర్ విశ్వేశ్వర కాలనీలో..

మియాపూర్: ప్రధాన రహదారుల్లో నెల రోజులుగా మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుంచి పొంగి రోడ్లపై ప్రవహిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను పరిశీలించి వెళ్తున్నారే తప్పా మురుగు సమస్యకు పరిష్కారం చూపడం లేదంటూ స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసిన ప్రతిసారి నామమాత్రంగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ వాపోతున్నారు. అండర్ గ్రౌండ్ పైప్ లైన్‌లలో చెత్తాచెదారం, పూడిక సరైన సమయంలో తొలగించకపోవడంతో మురుగునీరు సాఫీగా ప్రవహించక ఎక్కడపడితే అక్కడ మ్యాన్‌హోళ్ల నుంచి పొంగిరోడ్లపై ప్రవహిస్తుంది. రోడ్లపై రోజులు తరబడి మురుగునీరు ప్రవహించడంతో దుర్వాసన భరించలేక స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ వెళ్లే రోడ్డులో గత రెండు నెలలుగా మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తుంది. మాదాపూర్ హిల్స్, పీజేఆర్‌ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి వచ్చే మురుగునీరంతా ఈ పైప్‌లైన్ల వెంబడి కిందకి వస్తుంది. గతంలో కంటే పీజేఆర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు పెరిగిపోవడంతో మురుగునీటి సామర్థ్యానికి సరిపడ పైప్‌లైన్లు లేక చిన్నవిగా ఉండడంతో మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తుంది.
- చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరకాలనీ ప్రధాన రోడ్డులో నెలరోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. కాలనీలోని ఆలయం ముందు నుంచి మురుగు ప్రవహించడంతో గుడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా పక్కనే మియాపూర్ పోలీస్‌స్టేషన్ ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలు, పోలీసులు ఆ మురుగులో నుంచే వెళ్లాల్సి వస్తుంది.
- మియాపూర్ జేపీనగర్ కాలనీలో ప్రధాన రహదారిపై తరచూ మురుగు ప్రవహిస్తుంది. స్థానికులు ఫిర్యాదు చేసిన ప్రతిసారి తూ.తూ.. మంత్రంగా ఎయిర్ మిషన్‌తో మరమ్మతులు చేసి వెళ్తున్నారు. మళ్లి కొన్ని రోజులకే సమస్య పునఃరావృతమవుతుందని స్థానికులు వాపోతున్నారు.
- మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, హైటెన్షన్ రోడ్డులో నిజాంపేట్ వైపు నుంచి వచ్చే మురుగునీరంతా నడిగడ్డ ఎదురు ఖాళీ స్థలంలో నిలిచిపోయింది. గత ఐదేళ్లుగా మురుగు సమస్య ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు నివాసముంటున్న స్థానిక ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- మురుగు సమస్యతో తీవ్ర దుర్వాస వెదజల్లుతుంది. తద్వారా దోమలు వృద్ధిచెంది రోగాల భారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రధాన రహదారులో మురుగు ప్రవహించడంతో మురుగునీటిలో నుంచే ఆలయాలకు, గణపతి మండపాలలో పూజలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై మురుగునీరు పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రజాప్రతినిధులు రాజకీయ ప్రయోజనాలే చూసుకుంటున్నారు తప్పా సమస్యలు పట్టించుకోవడం లేదని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రెండు నెలలుగా సమస్యలతో సతమతమవుతున్న పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్తపైప్‌లైన్‌లను ఏర్పాటు చేసి మురుగు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


చందానగర్‌లోని పీజేఆర్ఎన్‌క్లేవ్ రోడ్డులో..


మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్‌లో..

లింక్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి


మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

చందానగర్: పాపిరెడ్డి కాలనీ సమీపంలోని లింక్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం పాపిరెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సందయ్యనగర్, రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీ, సురభీ కాలనీ, ఆరంభ టౌన్‌షిప్ చుట్టు పక్కల ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా ఆ సమస్య పరిష్కార దిశగా తక్షణమే రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించి లింకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి, నిర్మాణ పనులు యుద్ధప్రతిపాదికన టెండరు వేయించి పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీచ్చారు. ఏఈ భాస్కర్, వార్డు సభ్యులు రాంబాబు, రమేష్, వేణు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, రమణయ్య లింగారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకుంది. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయిచరణ్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో గణేశ కౌత్వం, జతిస్వరం, బృందావన నిలయం, దశావతారశబ్దం, మండూకశబ్దం, రుక్మిణీ ప్రవేశదరువు, అష్టపది, రామాయణశబ్దం, దుర్గ తరంగం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు సాయిచరణ్, చక్రవర్తి, ఐశ్వర్య, చందన, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 3,000 మంది ఉపాధ్యాయులకు సొంత నిధులతో రూ. ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా అందించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు శేఖర్‌రావు, రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సాయితేజ పాల్గొన్నారు.

అలరించిన 'స్వరార్చన'



మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం కళాకారిమి తనయ నృత్యార్చన కార్యక్రమం, స్రవంతి ఆర్ట్స్ అకాడమీ శిష్యబృందం స్వరార్చన కార్యక్రమంలో సందర్శకులను అలరించారు. స్వరార్చన కార్యక్రమంలో కళాకారులు శ్రావ్య, శ్రీనిక, సుధీక్, మృదంగం పవన్‌కుమార్, గురువు డాక్టర్ శిరీష కాసినాదుని కలిసి గణేశపంచరత్న, ముద్దుగారే యశోధ, వచ్చెను అలివేలుమంగ అంటు సంకీర్తనలకు నృత్యాభినయాన్ని చేసి సందర్శకులను అలరించారు. పద్మశ్రీ డా. శోభరాజు కళాకారులను సన్మానించారు.

కులగణన పోరాటం అసెంబ్లీ, పార్లమెంటును తాకాలి

రిటైర్డు డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు

రాయదుర్గం: విద్యార్థుల కులగణన పోరాటం అసెంబ్లీ, పార్లమెంటును తాకాలని విశ్రాంత డీజీపీ, బీపీసీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన గేటు బయట ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో సత్యాగ్రహ పోరాటాన్ని శనివారం ప్రారంభించారు. విద్యార్థుల పోరాటానికి ఆయన సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాధికారం కులగణనతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇతర విద్యా సంస్థల్లోని విద్యార్థి సంఘాలు ఏఐఓబీసీఎస్ఏ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని ఆయన సూచించారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు


మాట్లాడుతున్న సీపీఎం నేత వాజీద్ అలీ

పటాన్‌చెరు టౌన్: సీతారాం ఏచూరి మరణం వామపక్ష పార్టీలకే కాకుండా దేశానికి తీరని లోటు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజీద్ అలీ, పాండురంగారెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రామికభవన్‌లో శనివారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారని కొనియాడారు. రాజ్యసభలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, కార్మిక, కర్షక, ప్రజా పోరాటాలకు మద్దతుగా తన గలాన్ని విప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అర్జున్, మల్లేష్, లకాన్, రమణా రెడ్డి, తలారి శ్రీను, ఏడుకొండలు, రామకృష్ణ, ఆంజనేయులు, చక్రధర్‌సింగ్, మూర్తి పాల్గొన్నారు.

కుంగిన రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్


కుంగిన రోడ్డును అధికారులతో పరిశీలిస్తున్న కార్పొరేటర్

చందానగర్: శాంతినగర్‌లో ఓపెన్ నాలాలోని నీరు డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోకి చేరడంతో సుమారు 5 మీటర్లు పొడవు, 2 మీటర్ల లోతులో రోడ్డు కుంగిపోయిన నేపథ్యంలో శనివారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, కుంగిన రోడ్డుకు త్వరతగతిన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


సోని

మియాపూర్: యువతి అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. న్యూ హఫీజ్‌పేట్ మార్తాండనగర్‌కు చెందిన రవికుమార్ కుమార్తె సోని(18) ఈనెల 8న ఉదయం 6 గంటలకు కొండాపూర్ సూపర్ మార్కెట్‌లో పని ఉందని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు సోని ఆచూకి కోసం స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో తండ్రి రవికుమార్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గణపయ్యా.. దీవించయ్యా

వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు చోట్ల పెద్ద ఎత్తున ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిత్యం ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.
– శేరిలింగంపల్లి జోన్ బృందం



చందానగర్ గిరిజ మార్వెల్ అపార్ట్‌మెంట్‌లో యూపీఐతో హుండీ కానుకలు


కార్పొరేటర్ మంజులా రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గణేష్ ఉత్సవ మహిళా ప్రతినిధులు


కొండాపూర్‌లో..


గచ్చిబౌలిలో.. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి


సిద్ధివినాయక వరప్రాద అసోసియేషన్ ఆధ్వర్యంలో..


మాదాపూర్‌లోని సాయినగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


మక్తామహబూబ్‌పేటలో బీజేపీ సీనియర్ నాయకుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నిర్వాహకులు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. బొంతపల్లి శివారులోని ఓ ప్రైవేట్ కంపెనీ వెనకాల శనివారం గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకొని మృతిచెంది కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 35 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్

కూకట్‌పల్లి: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కూకట్‌పల్లి, బాలానగర్ జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాల గ్రౌండ్‌లో శనివారం జరిగాయి. కార్యక్రమంలో స్థానిక పాఠశాల చైర్మన్ ఉనియన్, హెడ్ మిసెస్ సుజాత పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో కూకట్‌పల్లి, బాలానగర్ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కూకట్‌పల్లి జోన్ తరపున జిల్లా స్థాయిలో పాల్గొంటారని క్రీడా కార్యదర్శి బి. యాదయ్య తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువతి మృతి


కలువ మాధవి

మాదాపూర్: విధులను ముగించుకుని నడుచుకుంటూ వెళ్తున్న యువతిని ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం బర్కత్‌పురాలో నివాసముంటున్న కలువ మాధవి (25) శుక్రవారం రాత్రి 8.45 గంటలకు విధులను ముగించుకుని కొత్తగూడ ఎక్స్‌రోడ్ నుంచి సైబర్ టవర్‌వైపు నటుచుకుంటూ వెళ్తూ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి కొత్తగూడ ఎక్స్ రోడ్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 6 గంటలకు చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.